
# రాజకీయ ప్రహసనం

— వాణిశ్రీ



కథా నిలయం
శ్రీకాకుళం

ఎలక్షన్ ఇంకో వారం రోజుల్లోకి వచ్చింది.

రామానాయుడికి ధైర్యం దిగజారి పోతోంది.

'ఈ సారి తను గెలవడం కలలో మాట' అనుకున్నాడు. నిరాశతో అతని మనసు క్రుంగి పోయింది.

గత రెండు ఎలక్షన్స్‌లోనూ రామానాయుడు సునాయాసంగా గెలిచాడు. అందులో అతని ప్రతిభ ఏం లేదు. అధికారంలో వున్న

పార్టీ టిక్కెట్టు దొరికింది. ప్రముఖ నాయకులు అతని నియోజక వర్గంలో మీటింగ్‌లు పెట్టారు. పార్టీ కేంద్ర కార్యాలయం వాళ్ళు రంగు రంగులలో అచ్చు కొట్టించిన వాల్‌పోస్టర్లు కుప్ప తిప్పలుగా వచ్చి పడ్డాయి. వాటితో పాటు డబ్బు కూడా వచ్చింది. ప్రతి వూళ్ళోనూ కార్యకర్తలు వున్నారు. ఇకనేం? చేతి చమురు వదలకుండానే అత్యధిక మెజారిటీతో గెల్చాడు. టాప్ లేని కారులో పూల దండలు వేసుకుని వూరేగాడు.

'ఆ రోజులు మళ్ళీ వస్తాయా?' తనలో తనే ప్రశ్నించుకుని నిట్టూర్చాడు నాయుడు.

ఈ సారి కూడా అతనికి అధికార పార్టీ టిక్కెట్టు వచ్చింది. పార్టీ ఆఫీసునుంచి ఆఫ్‌సెట్ కలర్ వాల్‌పోస్టర్లూ వచ్చాయి. కావలసినంత డబ్బు కూడా వచ్చింది. కార్యకర్తలు వూళ్ళో గోడల నిండా తన పేరు—కారు పెద్దంత అక్షరాలతో రాసి ప్రచారం చేస్తున్నారు. డబ్బు మంచి నీళ్ళలా ఖర్చు పెడుతున్నాడు. కార్లు పెట్రోలు తాగేస్తున్నాయి. అయినా అతనికి గెలుస్తాననే నమ్మకం కలగడం లేదు.

కారణాలు అనేకం వున్నాయి. అధికార పార్టీలో చీడపురుగులు చేరి గత రెండేళ్ళుగా ఎన్నో అవకతవక పనులు చేశాయి. ఎందరినో బెదిరించి డబ్బు సంపాదించుకున్నారు. బీదవాళ్ళ గుడిసెల మీద సైతం బుల్‌డోజర్లు నడిపి రాక్షసులని బిరుదులు పొందారు. తమకు పడని వాళ్ళనల్లా జైళ్ళల్లోకి నెట్టి హింసించారు. ఖజానాను ఖాళీ చేసి దేశానికి ద్రోహం చేశారు.

అవన్నీ ఇప్పుడు బైట పడ్డాయి. జనం తమ పార్టీని బాహాటంగానే తిడుతున్నారు. పేపర్ల వాళ్ళు తమ పార్టీ నాయకులను రావణాసురుడు, హిరణ్యకశిపుల క్రింద పోల్చి విమర్శిస్తున్నారు.

ఇన్నాళ్ళూ ఎదురు లేని తమ పార్టీకి ప్రత్యామ్నాయ పార్టీ ఒకటి వెలిసింది. జనం ఆ పార్టీ మీద మోజు చూపుతున్నారు.

ఇక తనకి ప్రత్యర్థిగా నిలుచున్న బంగారయ్య కులం వాళ్ళు-తన నియోజక వర్గంలో నాలుగోవంతు వున్నారు. వాళ్ళంతా అతనికే ఓటు వేస్తారని రూఢీగా తెలిసింది. పల్లెల్లో తమ పార్టీకి బలం వున్నా ఈ పెను తుఫాన్‌లో గాలి ఎటు వీస్తుందో ఎవరూ చెప్పలేరు.

నాయుడు అవన్నీ తలుచుకుని

బేజారెత్తిపోయాడు. 'తను ఓడిపోతాడు' అనే ఆలోచన రాగానే గుండె ఆగిపోయినట్లయి బాధ పడుతున్నాడు. 'ఇన్నాళ్ళూ తను మకుటం లేని మహారాజులా వెలిగిపోయాడు. ఇప్పుడు ఓడిపోతే తనను....మాజీ....మాజీ....'

నాయుడికి పిచ్చెక్కిపోతోంది.

ఫ్రిజ్ తీసి విస్కీ బాటిల్ ఓపెన్ చేశాడు.

*    *    *

"ఒరేయ్ రంగనాయకులూ! ఇట్లా రారా!" అని పిలిచాడు నాయుడు.

రంగనాయకులు వచ్చి సోఫా ప్రక్క నిల్చున్నాడు.

"తెల్లవారుజామున నాకో బ్రహ్మాండమైన ఐడియా వచ్చిందిరా! ఈ దెబ్బతో ఆ బంగారయ్య ఔట్. మనం నెగ్గడం ఖాయం!" హుషారుగా అన్నాడు నాయుడు. అతని ముఖం ఉదయ సూర్యుడిలా వెలిగిపోతోంది.

"ఎలక్షన్ ఇంకా నాలుగు రోజుల్లోకి వచ్చింది. ఇప్పుడు మనం వేసే మంత్రం పారుద్దా?" నిరాశగా అన్నాడు రంగనాయకులు.

"ఇంకా నాలుగు రోజులుండబట్టే ఈ ఐడియా వచ్చింది."

"ఏమిటో చెప్పండి?"

"ఇది బ్రహ్మ రహస్యం."

తల ఊపాడు రంగనాయకులు.

"ఇంకో కంటికి తెలియగూడదు. మూడో మనిషి పసిగట్టగూడదు. ఇది మన ఇద్దరి మధ్యే వుండాలి" నెమ్మదిగా అన్నాడు నాయుడు.

"అమ్మమ్మ! మీరు అంతగా చెప్పాలా? నా గుణం మీకు తెలియదా?" నిష్ఠూరంగా అన్నాడు రంగనాయకులు.

"తెలుసు గనకనే ఈ బృహత్కార్యం నీ భుజం మీద పెట్టాను" నవ్వుతూ అన్నాడు నాయుడు.

"ఈ రంగ నాయకులు రాంభక్త హనుమాన్. నాయుడిగారికి నమ్మిన బంటు. ఆజ్ఞాపించండి ఏం చేయాలో? ఆ బంగారయ్యని గోతిలో పెట్టమంటారా? లేకపోతే కాళ్ళూ, చేతులూ విరిచెయ్యమంటారా?" ఉత్సాహంగా అన్నాడు రంగనాయకులు.

"అట్లా చేస్తే జనం సానుభూతి వాళ్ళకే పోతుంది. బంగారయ్యకి ఓట్లవర్షం కురుస్తుంది. మన నెత్తిన పేడ వర్షం పడుతుంది."

"అయితే, మీ సూపర్ ప్లాన్ ఏమిటో చెప్పండి!"

"జాగ్రత్తగా- వళ్ళు దగ్గర పెట్టుకుని విను" అన్నాడు

రామానాయుడు విస్కీ సిప్ చేస్తూ.

రంగనాయకులు తల వూపి, నాయుడు వైపు ఒరిగాడు.

"ఈ రోజు ఉల్లిపాలెంలో మన పార్టీ బహిరంగ సభ వుంది గదా?"

"అవును."

"మీటింగ్ అయ్యేటప్పటికి రాత్రి పది దాటుతుంది. ఆ తర్వాత నేను డ్రైవ్ చేసుకుంటూ జీప్‌లో ఇంటికి వస్తూవుంటాను."

"వూఁ...."

"వింటున్నావా?"

"ఆఁ."

"ఏం చెప్పాను- చెప్పు?"

"మీరు జీప్ డ్రైవ్ చేసుకుంటూ ఇంటికి వెళ్తుంటారు."

"వెరీ గుడ్! నేను మర్రిచెట్టు దగ్గరికి రాగానే నువ్వు కర్ర తీసుకుని ముందు నా జీప్ అద్దాలు పగలగొట్టు. ఆ తర్వాత కర్రతో నా నెత్తిమీద కొట్టు. నెమ్మదిగా కొట్టాలి....గట్టిగా కొట్టావా-చచ్చి వూరుకుంటాను'' నవ్వుతూ అన్నాడు నాయుడు.

రంగనాయకులు నిర్వెరబోయి బొమ్మలా నిల్చుండి పోయాడు.

"ఏరా! బోధపడిందా నేను చెప్పిందంతా?"

రంగనాయకులు వులిక్కిపడి, "వింటున్నాను సార్! ఇదంతా ఎందుకు సార్?" అన్నాడు అయోమయంగా.

నాయుడు చిద్విలాసంగా శ్రీకృష్ణ పరమాత్ముడిలా చిరు నవ్వు నవ్వి, "జనం సంగతి నీ కేమి తెలుసురా! వాళ్ళ నాడి నాకు తెలుసు" అన్నాడు.

రంగనాయకులుకి పూర్తిగా అర్థం కాలేదు- నాయుడిగారి ప్లాన్ ఏమిటో.

"అంతేనా సార్?" అన్నాడు.

"ఆఁ- తర్వాత నువ్వు గట్టిగా కేకలు పెట్టు. ఇళ్ళల్లో జనం బైటికి వస్తారు. నువ్వు ఏడుస్తూ అవతల పార్టీ వాళ్ళు మా అయ్యగారిని కొట్టారని చెప్పు. ఆ తర్వాత నన్ను గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి. మన పార్టీ ఆఫీసుకి ట్రంకాల్ చేసి చెప్పండి-చాలు!" అన్నాడు నాయుడు.

"చిత్తం!" అన్నాడు రంగనాయకులు.

* * *

రామానాయుడి గారిని ప్రత్యర్థి వర్గం వారు చంపాలని చూశారనీ, తలమీద పెద్ద గాయమైతే గవర్నమెంట్ హాస్పిటల్లో చేర్చారనీ, పరిస్థితి ఆందోళనకరంగా వుందనీ రేడియో ప్రసారం చేసింది.

పత్రికలలో పతాక శీర్షికలతో ఈ సంఘటన వివరంగా రాయబడింది. అందులో నాయుడుగారి గురించి గొప్పగా పొగిడారు. ఆ నియోజక వర్గం ఆయనకు కంచుకోటనీ, ఆయన మీద విజయం సాధించలేమని గ్రహించి ప్రత్యర్థి వర్గాలు ఈ దారుణానికి ఒడిగట్టాయనీ, సభ్య సమాజం ఈ పైశాచిక కృత్యాలు సహించబోదనీ వివరించాయి.

పార్టీ నాయకులు ఎదుట పార్టీ వారిని ఘాటైన పదజాలంతో విమర్శిస్తూ ప్రకటనలు చేశారు. రామానాయుడిగారి గెలుపు మాత్రం ఖాయమనీ, అది ఎవరూ ఆపజాలరనీ, ప్రజలను ఎవరూ మోసం చేయలేరనీ, వారు మేధావులనీ పొగిడారు.

'నాయుడుగారిని తమ పార్టీ వాళ్ళు కొట్టలేదు మొర్రో!' అని అవతల పార్టీ వాళ్ళు మొత్తుకున్నారు. కాని వినేది ఎవరు?

'చేసిన తప్పు ఎవరు ఒప్పుకుంటారు?' అనుకున్నారు ప్రజలు.

* * *

రంగనాయకులికి మాత్రం గుండె దడగా వుంది.

నాయుడిని చావు దెబ్బలు కావాలనే కొట్టాడు. ఇంతకంటే అవకాశం ఎప్పుడు వస్తుంది?

రంగనాయకులు ఒకప్పుడు

## రచయితలకు మనవి

'విజయ'లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు-ఏవైనా సరే ప్రచురణార్థం కాని వాటిని త్రిప్పి పంపగోరు వారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు అభిమానుల పేజీ'లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్.

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్,

'విజయ'

80-ధనలక్ష్మి కాలనీ, మద్రాసు-600 026.

నాగయ్య కూతురు మల్లిని ప్రేమించాడు. నాగయ్య నాయుడిగారి ఫ్యాక్టరీలో వాచ్‌మాన్‌గా పని చేసేవాడు. ఇద్దరికీ మనసులు కలిశాయి. మాటలూ కుదిరాయి. నాయుడుగారికి చెప్పి పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు.

కాని ఇంతలో దారుణం జరిగిపోయింది. ఎవరో మల్లిని చెరిచి, చంపేశారు.

రంగనాయకులు ఆవేశంతో వూగిపోయాడు. వాడెవడో తెలిస్తే పేగులు తీస్తానని మండిపడ్డాడు.

తీరా తెలిసేసరికి నిర్విణ్ణుడయ్యాడు. అతను నాయుడే!

కొండను పొట్టేలు ఢీ కొనలేదని రంగనాయకులికి తెలుసు. అందుకే నోరు మూసుకుని వూరుకున్నాడు.

ఇన్నాళ్టికి అతనికి అవకాశం వచ్చింది. తనంతట తనే కొట్టమని అనేటప్పటికి అతనిలో చల్లారిన పగ రగిలింది.

చావు దెబ్బలు ఒకటి కాదు—రెండు కొట్టాడు.

నాయుడు నెత్తురు వరదలో మునిగిపోయాడు.

'నాయుడు ఇప్పుడు హాస్పిటల్లో వున్నాడు. ఇంకా చావలేదు. బహుశా చావడేమో! ఛస్తే ఫరవా లేదు. తను బతికిపోతాడు. లేదా నాయుడు తనని వదలడు. తనకి భూమిం మీద నూకలు చెల్లిపోతాయి.'

రంగనాయకులు తుఫానులో చిక్కుకున్న చెట్టులా గజగజ వణికి పోసాగాడు.

* * *

పోయినసారి ఎలక్షన్‌లో లక్షపై చిలుకు ఓట్ల మెజారిటీతో గెల్చిన రామానాయుడు ఈ సారి రెండు లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు.

పార్టీ కార్యకర్తలు వుత్సాహంతో కేకలు పెట్టారు. సంతోషం పట్టలేక ఎగిరి గంతులు వేశారు.

అక్కడ ఓట్ల లెక్కింపు పూర్తయి నాయుడు గెలిచినట్లు ప్రకటించడమూ, ఇక్కడ గవర్నమెంట్ హాస్పిటల్లో నాయుడు చనిపోయాడని డిక్లేర్ చెయ్యడమూ ఒకే సమయంలో జరిగాయి.

రంగనాయకులు ముఖం అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడులా కళకళ లాడింది, తళతళ మెరిసింది. 'బతుకు జీవుడా!' అనుకున్నాడు.

తేలిగ్గా వూపిరి పీల్చుకుని నాయుడుగారి అంతిమ యాత్రకు సన్నాహాలు చేయడానికి నడుము కట్టాడు. *